## క్లుప్తంగా

### ఓటరు జాబితాలో మార్పు, చేర్పులకు అవకాశం



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

**సిరికొండ:** ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులను బీఎల్‌వోలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వచ్చే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఓటుహక్కు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విలాస్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

### సుకన్య సమృద్ధి యోజన పనితీరుపై అధ్యయనం



అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

**తాంసి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన పథకంపై అధ్యయనం చేశారు. బుధవారం కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీకి చెందిన అర్థశాస్త్ర అధ్యాపకులు శ్రీవాణి బృందంతో కలిసి జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించారు. సభ్యులు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) న్యూఢిల్లీ వారి సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో పథకం తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. తాంసి, భీంపూర్ మండలాల్లోని కప్పర్ల, సావర్గాం, పిప్పల్‌కోటి, నిపాని గ్రామాలను సందర్శించి, సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన కల్పించారు. మహిళలతో స్వయంగా మాట్లాడి పథకం గురించి వివరించారు. ప్రతీ ఆడపిల్ల కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారి వెంట ప్రాజెక్టు కోడైరెక్టర్, సామాజిక శాస్త్ర ప్రొఫెసర్ పద్మావతి, రీసెర్చ్ అసిస్టెంట్ అమోల్, రంజిత్, ఆకాష్, సౌరభ్, ప్రజ్వల్, తదితరులు పాల్గొన్నారు.

### పోస్టల్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



సమ్మె చేస్తున్న ఉద్యోగులు

**బోథ్:** తమ డిమాండ్లను నెరవేర్చాలని పోస్టల్ జీడీఎస్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. బోథ్‌లో బుధవారం తమ నిరసనను వ్యక్తం చేశారు. తమకు 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సురెన్స్‌ను రూ. 5 లక్షల వరకు పెంచాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ జీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### అన్నదానం

**తలమడుగు:** మండలంలోని సాయి లింగి గ్రామంలోని సాయి వృద్ధాశ్రమంలో పొన్నారి గ్రామానికి చెందిన గడుగు శరణ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ గడుగు గంగన్న మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా ప్రజల్లో ఉంటూ అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ కొండ రాజన్న, సభ్యులు వెంబడి ప్రదీప్, భూమన్న, గోపాల్, పోచ్చన్న, గంగన్న, హరీష్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు సన్మానం

**నార్నూర్:** ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును బుధవారం గాదిగూడ మండల ఆదివాసీ నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా ఏజెన్సీ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. ఇందులో నాయకులు పరుసురాం, వామన్‌లు పాండురంగ్ పాల్గొన్నారు.

### చెట్టు కిందే గ్రామసభ



చెట్టు కింద నిర్వహిస్తున్న గ్రామసభ

**బోథ్:** చాలా గ్రామాల్లో గ్రామ పంచాయతీలకు భవనాలు లేక అంగన్‌వాడీ కేంద్రాల్లో, చెట్లకింద, గ్రామసభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధిహామీ పథకం బడ్జెట్‌కు సంబంధించిన గ్రామసభను చెట్టుకింద నిర్వహించారు. గత ఐదేళ్లుగా చెట్టు కిందనే గ్రామసభ, సమావేశాలను నిర్వహిస్తున్నామని సర్పంచ్ బండారి శ్రీధర్ రెడ్డి తెలిపారు.

# ‘అభయ హస్తం’పై ఆశలు

- పునరుద్ధరణకు ఎదురుచూపులు
- నూతన ప్రభుత్వం అమలు చేయాలని మహిళా సంఘాల వినతి
- ఆదిలాబాద్ ఉమ్మడి మండలంలో 759 ఎస్‌హెచ్‌జీలు



మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమైన ఐకేపీ అధికారులు (ఫైల్)

**ఆదిలాబాద్‌రూరల్:** మహిళా స్వయం సహాయక సంఘంలోని సభ్యులకు అండగా నిలిచేందుకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభయహస్తం, ఆమ్ఆద్మీ, జనశ్రీ యోజన వంటి పథకాలను ప్రవేశపెట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనంతరం 2014లో అధికారంలోకి వచ్చినా టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) ప్రభుత్వం వాటిని కొనసాగించలేదు. మహిళలకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో తీసుకువచ్చినా అభయహస్తం లాంటి పథకాలను కొనసాగించాలని ప్రతి పక్షంలో కొనసాగినా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. అయిన్నప్పటికీ టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించలేదు. ఇటీవల తెలంగాణలో అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పునరుద్ధరిస్తే బాగుంటుందని పలువురు మహిళ సంఘాల సభ్యులు కోరుతున్నారు.

**759 ఎస్‌హెచ్‌సీ సంఘాలు**

ఆదిలాబాద్ ఉమ్మడి మండలంలోని ఆదిలాబాద్ రూరల్ మండలంలో 650 ఎస్‌హెచ్‌సీ సంఘాలు ఉండగా.. ఇందులో 7వేలకు పైగా సభ్యులు ఉన్నారు. 38 గ్రామ సంఘాలున్నాయి. మావల మండలంలో 109 ఎస్‌హెచ్‌జీ సంఘాలు ఉండగా.. 1,650 మంది సభ్యులు ఉన్నారు. ఐదు గ్రామసంఘాలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లోని అభయహస్తం, ఆమ్ఆద్మీ, జనశ్రీ యోజన పథకాలను కొనసాగిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ మండలంలోని 8,650 మందికి ప్రయోజనం చేకూరనుంది.

**రూ. 365 చెల్లింపు మాత్రమే..**

స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉండి రూ. 365 చెల్లిస్తే మిగితా రూ. 365 ప్రభుత్వం తరపు నుంచి చెల్లించేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు చాలా మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు చెల్లించారు. అయిన్నప్పటికీ వాటిని తిరిగి ఇవ్వలేదు. అయితే మహిళ సంఘంలో ఉన్న సభ్యుల పిల్లల చదువుల కోసం స్కాలర్‌షిప్ కింద రూ. 1,200 ఏడాదికి చెల్లించే వారు. ఈ చెల్లింపు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుకునే వారికి అందజేసే వారు. 60 సంవత్సరాల వయస్సు దాటిన వారికి రూ. 500 పింఛన్ అందజేసే వారు. అలాగే సభ్యురాలు మరణిస్తే రూ. 30వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 75వేల పరిహారం అందజేసేవారు. మరో పథకం ఆమ్‌ఆద్మీ బీమా పథకంలో ఏడాదికి రూ. 15 చెల్లించేవారు. వీటితో పాటు జనశ్రీ యోజన లాంటి పథకాలు ఉండేవి.

#### అభయ హస్తం పునరుద్ధరించాలి



డ్వాక్రా సంఘంలో గత 30 ఏళ్లపై నుంచి సభ్యురాలిగా కొనసాగుతున్నా. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇన్సురెన్స్, పిల్లలకు స్కాలర్ షిప్ పథకం వర్తిస్తుందంటే ఏడాదికి రూ. 365 చెల్లించే వాళ్లం. ఈ పథకం కొనసాగినాన్ని రోజులు సుమారు రూ. 10వేల వరకు చెల్లించాను. వాటిలో నుంచి నాకు తిరిగి రూపాయి రాలేదు. మళ్లీ అభయహస్తం పునరుద్ధరించాలి.

– గొలిపెల్లి గంగమ్మ, గ్రామ సంఘం అధ్యక్షురాలు, అంకోలి

#### రూ. 9 వేలు కట్టిన



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభయ హస్తం, ఆమ్ఆద్మీ, జనశ్రీ యోజన లాంటి పథకాలు వర్తిస్తాయి అంటే రూ. 9వేలు కట్టినా. టీఆర్ఎస్ గవర్నమెంట్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినంతరం డబ్బులు ఏటుపోయిన్నాయో తేలవదు. కనీసం మేము కట్టినా పైసాలు మాకు తిరిగి ఇవ్వలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున గతంలో మహిళలకు వర్తింప చేసిన పథకాలను వర్తింప చేస్తే బాగుంటుంది.

– సంఘల్‌వార్ రాధాబాయి, మండల సమాఖ్య అధ్యక్షురాలు

## ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి




ధర్నా చేస్తున్న నాయకులు, ఆటో డ్రైవర్లు

**ఎదులాపురం:** రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను వెంటనే ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎదుట గల రహదారిపై బుధవారం ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం మూలంగా నేడు ఆటోవాలాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. గిరాకీ తగ్గి డీజిల్ ఖర్చులు కూడా భారంగా మారే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్క దేవిదాస్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెస్రం భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గెడం కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలి**

**ఇంద్రవెల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రకటించడం ద్వారా ఉపాధి కోల్పోతున్నామని ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు గాయక్‌వాడ్ భారత్ అన్నారు. బుధవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గిరాకీ లేక కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆటోబంధు పథకం అమలు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ డ్రైవర్లు పెందోర్ పాండురంగ్, సాగర్, నాగ్‌నాథ్, శ్యాం, లక్ష్మణ్, ఉత్తమ్, రాజు, సయ్యద్ గౌసోద్దీన్, ముండే రాంకిషన్, పుండలిక్, రవికాంత్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

### 31న రక్తదాన శిబిరం

**ఇంద్రవెల్లి:** ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా ఆలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 31న రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా మెస్రం వంశం యువకులతో పాటు యువత హాజరై రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

### సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**నార్నూర్:** కొత్తపల్లి- హెచ్ గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 20 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ సుభద్ర రాథోడ్ అన్నారు. బుధవారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిచేశారు. ఆమె మాట్లాడుతూ.. పీఎంఏజీవై పథకం కింద గ్రామ పంచాయతీ ఎంపిక కావడంతో రూ. 20 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. నాణ్యత పాటించాలని ఎంపీటీసీ రేణుకదిలీప్ జాదవ్ సూచించారు.

## అందరి హక్కులను గౌరవించాలి



మాట్లాడుతున్న బొంత ఆశారెడ్డి

**ఉట్నూర్‌రూరల్:** రాజ్యాంగ రచయిత బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనల మేరకు అందరి హక్కులను గౌరవించాలని గోండ్వాన గణతంత్ర పార్టీ రాష్ట్ర నాయకులు బొంత ఆశారెడ్డి అన్నారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నార్నూర్ మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లాలోని దళితులు ఏర్పాటు చేసుకున్న సభకు అనుమతి ఇవ్వొద్దని పోలీసులను ఆదివాసీ సంఘాల నాయకులు కోరడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతాల్లో 50 ఏళ్లకుపైగా ఉంటున్న దళితులు గిరిజనేతరులు కొందరు పరంపోగు భూములను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని, ఆ భూములను అమ్ముకునే వీలు లేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వారికి పట్టాలు ఇచ్చి క్రయ విక్రయాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. జిల్లాలోని ఆదివాసీ సంఘాల నాయకులు స్వహృదయంతో దళిత సభలను అడ్డుకోవద్దని కోరారు. సమావేశంలో భూమన్న ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన దుర్గం శేఖర్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో దుర్గం శేఖర్

**ఆదిలాబాద్‌టౌన్:** దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను కలిశారు. ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గతంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ నాయకుడిగా పనిచేశారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన జెడ్పీటీసీ**

**తలమడుగు:** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బుధవారం జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా బరంపూర్‌ను మండల కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించడం జరిగిందన్నారు.

## శివాజీ హయాంలో సమర్థవంతమైన పాలన



భూమిపూజ చేస్తున్న జోగు రామన్న

**ఆదిలాబాద్‌టౌన్:** ఛత్రపతి శివాజీ సమర్థవంతమైన పాలన అందించారని, తెలంగాణలో కేసీఆర్ కూడా సమర్థవంతమైన పాలన అందించారని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్ కాలనీలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై భూమిపూజ చేశారు. శివాజీ పాలనలో మహిళలకు గౌరవం లభించిందన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజల మధ్య ఉంటూ సేవ చేస్తానని అన్నారు. నాలుగుసార్లు అవకాశం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. ఆయన వెంట రవి, గంగారెడ్డి, ఆశమ్మ, భరత్, నారాయణ, ఫేరోజ్, ఇమ్రాన్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ కల్పన

**జైనథ్:** ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో బుధవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గమ్యం యాప్ గురించి వివరించి, ప్రయాణికులకు ఇన్‌స్టాల్ చేసి ఇచ్చారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, విహారయాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సు సర్వీసులను అందిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప మాల ధరించిన అయ్యప్ప భక్తులకు స్వామి దర్శనమునకు అద్దె ప్రాతిపదికన సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను అందజేస్తున్నట్లు, తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షణకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ విశ్వనాథ్, ఎంఎఫ్ శ్రీకర్, విలేజ్ బస్ ఆఫీసర్ సతీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈ-కేవైసీ పూర్తిచేయాలి



తాంసిలో..



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రామారావు

**తాంసి:** పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల ఈ-కేవైసీని వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ లక్ష్మి రేషన్ డీలర్లకు సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ-కేవైసీ నమోదుపై పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరి కేవైసీని ముమ్మరంగా చేపట్టి త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ విష్ణు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ పుష్పమాల, జూనియర్ అసిస్టెంట్ బాపురావు, రాఘవేంద్ర, డీలర్లు భూమన్న, వసంత్‌రావ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్చోడ:** ఆహార భద్రత కార్డు ఉన్న లబ్ధిదారులు సంబంధిత రేషన్ డీలర్ల వద్ద ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ జాదవ్‌రామారావు అన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనవరి 15 లోపు ఈ-కేవైసీ నమోదు చేయాలని సూచించారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారి రేషన్ బియ్యం పంపిణీ రద్దు అవుతుందన్నారు. సమావేశంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలకు బస్సులు నడిపించాలి



మాట్లాడుతున్న రాథోడ్ సకారం

**నార్నూర్:** గిరిజన గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త రాథోడ్ సకారం డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. కాని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నార్నూర్ మండలంలోని భీంపూర్, కొత్తపల్లి-హెచ్, మలేపూర్, మల్లెంగి మీదుగా రోడ్డు సౌకర్యం ఉందన్నారు. నార్నూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు బస్సులు నడిపించాలని కోరారు. ఆయన వెంట రాహూసాహెబ్, తొడసం తెలంగాణరావు, తదితరులు పాల్గొన్నారు.

# ‘పంచాయతీ’ పోరుకు రెడీ

- జనవరి 31తో ముగియనున్న పదవీకాలం
- ఎన్నికలకు సిద్ధమవుతున్న నేతలు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు



బోథ్ గ్రామ పంచాయతీ కార్యాలయం

**బోథ్:** గ్రామ పంచాయతీల్లో పంచాయతీ పాలకవర్గ పదవీకాలం వచ్చే సంవత్సరం జనవరి 31న ముగుస్తుంది. దీంతో ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సమాయత్తమవుతోంది. జనవరి లేదా ఫిబ్రవరిలో ఎన్నికలు ఉంటాయన్న వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి నుంచే ప్రజలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని భావిస్తున్నారు.

**బోథ్, సొనాలలో తీవ్రమైన పోటీ...**

బోథ్ మండలంలో సర్పంచ్ పదవిని ఆశిస్తున్న వారి మధ్య పోటీ తీవ్రంగా ఉంది. మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. బోథ్‌తో పాటు సొనాల మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉండటంతో ఈస్థానాలపై పోటీ అధికంగా ఉంది.

- గత పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానమెన బోథ్ మేజర్ గ్రామ పంచాయతీలో ప్రస్తుత సర్పంచ్ సురేందర్ యాదవ్ ఈఎన్నికల్లో కూడా బరిలో ఉంటానని పేర్కొంటున్నారు. ఆయనతో పాటు మాజీ వార్డు సభ్యులు లింగారెడ్డి, మీర్ ఇర్షాద్ అలీ, కట్ట భూమేష్‌తో పాటు దాదాపు 15 నుండి 20 మంది పోటీలో ఉండనున్నట్లు తెలుస్తోంది. బోథ్ జనరల్ స్థానం కావడంతో పోటీ అధికంగా ఉంది. ఈసారి గెలుపు తనదేనని అంటున్నారు. ఇక ఈసారి యువతకు బోథ్ ప్రజలు పట్టం కట్టబోతున్నారని కట్ట భూమేష్, మీర్ ఇర్షాద్ అలీలు పేర్కొంటున్నారు.
- ఇక సొనాల గ్రామంలో సైతం పోటీ అధికంగా ఉంది. ప్రస్తుత సర్పంచ్ సదానందం మళ్లీ పోటీలో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈయనతో పాటు దాదాపు 10 మంది సర్పంచ్ ఎన్నికల బరిలో ఉండనున్నట్లు తెలుస్తోంది.

**రిజర్వేషన్లపై ఆందోళన..**

జనరల్ స్థానాలపై పోటీ అధికంగా ఉండనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లను పది సంవత్సరాలు ఉండేలా గత పంచాయతీ ఎన్నికలప్పుడు చట్టం చేసింది. దీంతో ఈసారి పంచాయతీ ఎన్నికల్లో కూడా గత ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్లు ఉండనున్నాయి. ఒకవేళ ప్రభుత్వం రిజర్వేషన్లను మార్పు చేసేందుకు సిద్ధమైతే రిజర్వేషన్లు తారుమారయ్యే అవకాశం ఉంది. గత సంవత్సర కాలంగా సర్పంచ్ పదవి కోసం సిద్ధమవుతున్న నేతల్లో రిజర్వేషన్‌లు ఎలా ఉంటాయోనని ఆందోళన ఉంది. గత రెండేళ్లుగా తాము సర్పంచ్ పదవికోసం లక్షల్లో ఖర్చు పెట్టామని, రిజర్వేషన్లు మారితే తాము పోటీ చేసే అవకాశం ఉండదని ఆందోళన మొదలైంది. రిజర్వేషన్లు అనుకూలిస్తే ఈసారి ఎలాగైనా గెలవాలని వారు ఖర్చుకు వెనకాడటం లేదు. ఇప్పటికే యువజన సంఘాలు, పలు కులసంఘాల నేతలతో ఇప్పటికే సంప్రదింపులు జరుపుతున్నారు. చిన్న కులాలకు తాయిలాలు ప్రకటిస్తున్నారు.

### కానిస్టేబుల్ అభ్యర్థులకు ట్రైనింగ్ నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

**ఇంద్రవెల్లి:** ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షలో ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు వెంటనే ట్రైనింగ్ నిర్వహించాలని అభ్యర్థులు కోరారు. బుధవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఇంటికి వచ్చి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎంపికైన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులపై మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అభ్యర్థులు కోవ వినోద్‌కుమార్, మనోజ్, దుర్వ సంజు, ప్రవీణ్, దేవిదాస్, ఆత్రం అరవింద్, ఆత్రం తిరుమన్ పాల్గొన్నారు.